

పెండింగ్ దరఖాస్తుల సంఖ్య	
4 మునిసిపాలిటీలు	20,908
247 గ్రామ పంచాయతీలు	12,745
మొత్తం దరఖాస్తులు	33,653

మునిసిపాలిటీల దరఖాస్తులు	
వికారాబాద్	4,026
పరిగి	4,218
కొడంగల్	406
తాండూరు	12,258

ఎల్‌ఆర్‌ఎస్

అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్

ఎన్నికల హామీల అమల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్లార్ఎస్)కు మార్గదర్శకాలు జారీ చేసింది. అనుమతి లేని ప్లాట్లు, లే అవుట్లను నిబంధనల మేరకు క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల మొదటి వారంలోనే ప్రక్రియ ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. గత ప్రభుత్వం 2020 అక్టోబరు 31వ తేదీ వరకు ఎల్లారెస్‌కు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇందుకు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, పంచాయతీల పరిధిలో మొత్తం 37,223 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో కొన్ని రెగ్యులరైజ్ చేయగా 33,653 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు దరఖాస్తులను పరిశీలించి వివాదాలు, కోర్టు కేసులు, ప్రభుత్వ భూముల్లో లేని ప్లాట్లను క్షేత్రస్థాయిల్లో నిర్ధారించుకొని నిర్ణీత ఫీజు చెల్లించిన వారికి క్రమబద్ధీకరిస్తారు.

- పెండింగ్‌లో 33,653 దరఖాస్తులు
- మునిసిపాలిటీల్లో 20,908, పంచాయతీల్లో 12,745
- ప్లాట్ల ఓనర్లకు తప్పనున్న ఎదురు చూపులు
- రెగ్యులరైజేషన్ ఫీజుతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం

వికారాబాద్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతి లేని లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. తాజాగా మునిసిపాలిటీలు, పంచాయతీల్లోని అనుమతి లేని లే అవుట్లు, ప్లాట్ల రెగ్యులరైజేషన్‌పై మార్గదర్శకాలు జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతి లేని ప్లాట్లు, లే అవుట్లు క్రమబద్ధీకరణకు ఎస్ఆర్ఎస్ పేరిట దరఖాస్తులు స్వీకరించగా, జిల్లాలో భారీగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల క్రమబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించారు. అయితే ఎల్ఆర్ఎస్ కోసం భారీగా ఫీజులు చెల్లించాల్సి ఉండడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. కొందరు కోర్టును ఆశ్రయించగా ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో నాలుగు సంవత్సరాల పాటు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అనుమతి లేని లేఅవుట్లలో ప్లాట్లు కొని ఇళ్లు నిర్మించుకోవాలని భావించిన కొందరు కోర్టు తీర్పునకు లోబడి ఉంటామని అఫిడవిట్లు దాఖలు చేయగా వారికి ఎల్ఆర్ఎస్ వర్తింపజేశారు. మిగతా దరఖాస్తుదారులు మాత్రం ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూసినా గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొన్న వారు ప్లాట్లకు మొత్తం డబ్బు చెల్లించినా ప్రభుత్వ అనుమతి లేక రిజిస్ట్రేషన్ కాలేదు. తాము అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఎన్నికల హామీని నిలబెట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఎల్ఆర్ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)ను చేపట్టేందుకు వీలుగా మార్గదర్శకాలు జారీ చేసింది. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ఈ నెల మొదటి వారంలో ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

మూడు దశల్లో దరఖాస్తుల పరిశీలన

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు దశల్లో పరిశీలిస్తారు. అన్నీ నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులనే ఆమోదిస్తారు. తొలి దశలో ఎల్ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తును పరిశీలిస్తారు. వివాదాస్పద, కోర్టు కేసులు, ప్రభుత్వ భూముల్లోని అవుట్లు, ప్లాట్లను తొలి దశలోనే తిరస్కరిస్తారు. లే అవుట్ భూమి వివరాలను ధరణి రికార్డుల్లో పరిశీలిస్తారు. రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖలు, పట్టణ స్థానిక సంస్థల అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీలు లే అవుట్, ప్లాట్లు ఉన్న భూములు ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, ఎండోమెంట్ భూములకు, చెరువులు, కుంటలకు సంబంధించిన శిఖం భూములా? సీలింగ్, కోర్టు వివాదాల్లో ఆ భూములు ఉన్నాయా? అనేది పరిశీలిస్తారు. గుట్టలు, శిఖం భూములు, ఇనాం, వారసత్వ సంపద భూములను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తులను ఉన్నతాధికారుల పరిశీలనకు పంపుతారు. తొలి దశలో వడపోసిన దరఖాస్తులను టీపీవోలు, పంచాయతీ అధికారులు పరిశీలిస్తారు. రెండో దశలో లే అవుట్, రోడ్లు, ఖాళీ స్థలం వదలడం, ఇతర నిబంధనల ఉల్లంఘన, తదితరాంశాలను పరిశీలిస్తారు. అన్నీ సక్రమంగా ఉంటే ఆ దరఖాస్తులకు క్రమబద్ధీకరణ ఫీజు ఖరారు చేస్తారు. మూడో దశలో ఫీజు చెల్లించిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో మునిసిపల్ కమిషనర్ తదితరులతో ఏర్పాటయ్యే కమిటీ పరిశీలించి నిబంధనల మేరకున్న వాటిని క్రమబద్ధీకరిస్తారు.

మొత్తం 37,223 దరఖాస్తులకు 33,653 పెండింగ్

అక్రమ లే అవుట్లు, అనుమతి లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం 2020 అక్టోబరు 31 వరకు దరఖాస్తులు స్వీకరించింది. ఎల్ఆర్ఎస్‌కు జిల్లాలో 37,223 మంది దరఖాస్తు చేశారు. జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీల్లో 21,041 దరఖాస్తులు, 247 పంచాయతీల పరిధిలో 16,182 దరఖాస్తులొచ్చాయి. మునిసిపాలిటీల్లో 214, అలాగే 15 మండలాల్లోని 247 పంచాయతీల్లో 221 అక్రమ లే అవుట్లు వెలసినట్లు మునిసిపల్, పంచాయతీ అధికారులు తేల్చారు. ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు తాండూరులో 12,347, పరిగిలో 4,239, వికారాబాద్‌లో 4,041, కొడంగల్‌లో 414 దరఖాస్తులొచ్చాయి. అలాగే పంచాయతీల పరిధిలో 16,182 దరఖాస్తులు వచ్చాయి. వాటిల్లో పంచాయతీల్లో 3,337, మునిసిపాలిటీల్లో 233 ప్లాట్ల చొప్పున క్రమబద్ధీకరించారు. మిగతా ప్లాట్లు దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. క్రమబద్ధీకరణ దరఖాస్తు చార్జి కింద ప్రతీ లే అవుట్‌కు రూ.10వేలు, వ్యక్తిగత ప్లాట్‌కు వెయ్యి చొప్పున తీసుకున్నారు. ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.4.16కోట్ల ఆదాయం సమకూరింది. ఇదిలా ఉంటే పాట్ల ఓనర్లు కోర్టుకు అఫిడవిట్ సమర్పించి పట్టణాలు/గ్రామాల్లో 3,570 ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇవి పోను ప్రస్తుతం 33,653 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెంగిండ్‌లో ఉన్నాయి. వీటిని క్రమబద్ధీకరిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి వందల కోట్లలో ఆదాయం సమకూరనుంది.



పుష్పాంబరిగా సర్వమంగళాదేవి అమ్మవారు

శాకాంబరి రూపంలో

కన్యకా పరమేశ్వరి మాత

వికారాబాద్, ఆగస్టు 2: ఆర్యవైశ్య సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వికారాబాద్ శ్రీ రామ మందిరంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారిని శాకాంబరి మాత రూపంలో అలంకరించి పూజలు చేశారు. 'మన ఊరు-మన సారె' కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు మాలె లక్ష్మణ్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి యాష్కి సునీల్‌కుమార్, ఉపాధ్యక్షులు రఘునందన్, కోశాధికారి శ్రీకాంత్, కౌన్సిలర్ మోముల స్వాతిరాజ్‌కుమార్, సహాయ కార్యదర్శి మ్యాడం వేణుగోపాల్, జిల్లా మహిళా అధ్యక్షురాలు యాష్కి శిరీష, మహిళా సంఘం అధ్యక్షురాలు మ్యాడం లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి యాష్కి సువర్ణ, ఉపాధ్యక్షురాలు కొట్టి విజయలక్ష్మీ, సహాయ కార్యదర్శి కుంచం శ్రీదేవి, కోశాధికారి పోకల మమత, ఆర్యవైశ్య మహిళలు, ఇతర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పుష్పాంబరిగా అమ్మ వారి దర్శనం

ఘట్‌కేసర్ : ఆషాఢ మాస చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని పోచారంలోని సర్వమంగళ సమేత స్ఫటికలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన సర్వమంగళాదేవి అమ్మవారు పుష్పాంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢంలో అమ్మవారికి ప్రీతిపాత్రమైన శాకాంబరి, ఫలాంబరి, మధురాంబరి, పుష్పాంబరి అవతారాల్లో భక్తులు కొలుస్తారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారి సేవలో పాల్గొన్న మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ప్రజల జీవనోపాధిని మెరుగుపర్చాలి

అధికారులకు కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచన

వికారాబాద్, ఆగస్టు 2: ప్రజల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన పనులపై కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం పనులు చేపట్టాలన్నారు. ఐదు రోజులు రోజువారీ చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించాలన్నారు. స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్వాడీలు, హాస్టళ్లు, ఆరోగ్య కేంద్రాలు, బస్‌స్టాపుల్లో పారిశుధ్య పనులను చేపట్టాలన్నారు. కార్యాలయాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలకు తాగునీరు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. మురుగు కాలువలు, నీరు నిలిచిన ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా కృషిచేయాలన్నారు. మురుగు నీటిలో ఆయిల్‌బాల్స్ వేసి దోమల వృద్ధిని నిరోధించాలన్నారు. విష జ్వరాల బారిన పడిన వారికి చికిత్సలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువును తయారుచేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనంపై 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, పద్య గేయాల పోటీలు నిర్వహించి బహుమతులు, నగదు పారితోషికం ఇస్తామని కలెక్టర్ తెలిపారు.

లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటాలి : కలెక్టర్

లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు మొక్కలు నాటించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అవెన్యూ ప్లాంటేషన్ నిమిత్తం అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో నూతన పార్కులకు శ్రీకారం చుట్టాలన్నారు. ప్రతీ ఇంటికి మునగ, కరివేపాకు, మామిడి, ఉసిరి, దానిమ్మ మొక్కలను అందజేయాలన్నారు. ఒరిగిన స్తంభాలు, వేలాడుతున్న వైర్లను సరిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్డీవో శ్రీనివాస్, డీపీవో జయసుధ, డీఎంహెచ్‌వో పల్వన్‌కుమార్, డీఈవో రేణుకాదేవి, పీఆర్ ఈఈ ఉమేష్, పశుసంవర్థక శాఖ అధికారి పూర్ణచంద్రరావు, మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నిండుకుండలా చెంగోల్ పెద్ద చెరువు

నాలుగైదు రోజుల కింద కురిసిన వర్షాలకు కొన్ని చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చింది. మండలం చెంగోల్‌లోని పెద్ద చెరువులోకి భారీగా నీరు చేరి నిండుకుండలా మారింది. ఈ చెరువు కింద రెండు వందల ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువులోకి అనుకున్న మేర నీరు రావడంతో రైతులు నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. మరి కొందరు నారు పోసుకుంటున్నారు.

- తాండూరు రూరల్



వర్షం నీటితో కళకళలాడుతున్న చెంగోల్ పెద్ద చెరువు



స్థలాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దీపిక, అధికారులు

మేడ్చల్‌లో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం

స్థలాలను పరిశీలించిన చైర్‌పర్సన్ దీపిక, అధికారులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 2 : మేడ్చల్ మునిసిపాలిటీ పరిధిలో ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు రూ.38కోట్లతో ఐదు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులను నిర్మిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి తెలిపారు. అమృత్ 2.0పథకం కింద ఈ ట్యాంక్‌ల నిర్మాణానికి 6, 8, 10, 11, 14 వార్డుల్లో శుక్రవారం ప్రజారోగ్య డిప్యూటీ ఇంజినీర్ యాదయ్యతో కలిసి స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. జనాభా పెరుగుతున్నందున మేడ్చల్ మున్సిపాలిటీలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అమృత్ పథకం కింద పెద్దఎత్తున నిధులు రానున్నాయని తెలిపారు. ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో 4.6మిలియన్ లీటర్ల నీళ్లు నిల్వచేసే వాటర్ ట్యాంకులు ఉండగా కొత్తగా నిర్మించే ఐదు ట్యాంక్‌లతో మరో 3.5 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసుకునే వీలు కలుగుతుందన్నారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచుకుని ప్రజలకు సరఫరా చేసేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. మున్సిపల్ పరిధిలోని నీటి వనరులను పూర్తిగా ఉపయోగించుకుని తాగునీటి కొరత లేకుండా సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఈఈ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లేక పాఠశాల మూత!

బర్మాజీగూడ పాఠశాల పరిస్థితి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 2: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నా చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకే పంపుతున్నారు. దీంతో విద్యార్థుల్లేక కొన్ని సర్కారు బడులు మూతపడే పరిస్థితులు నెలకొంటున్నాయి. తాజాగా విద్యార్థులు లేక మేడ్చల్ మండలం బర్మాజీగూడ ప్రాథమిక పాఠశాల మూతపడింది. సెలవుల అనంతరం స్కూళ్లు తెరిచినప్పటి నుంచి ఒక్క విద్యార్థి, ఒక ఉపాధ్యాయురాలితో పాఠశాల కొనసాగింది. ఇప్పుడు ఆ ఒక్క విద్యార్థి కూడా మానేయడంతో గత్యంతరం లేక అధికారులు మూడు రోజుల కింద పాఠశాలకు తాళం వేశారు. ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి ఉంది. అయితే ఈ సారి ఇక్కడ రెండో తరగతి విద్యార్థి ఒక్కడే ఉన్నాడు. ఆ ఒక్క విద్యార్థి కూడా వారం రోజులుగా స్కూలుకు రాలేదు. దీంతో విద్యార్థి ఇంటికి టీచర్ వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులెవరూ లేక తమ కొడుకును ఒక్కడినే పాఠశాలకు పంపడం లేదని, వేరే స్కూల్లో చేర్పిస్తామని చెప్పారు. విషయాన్ని ఉపాధ్యాయురాలు అధికారులకు తెలిపారు. దీంతో విద్యాశాఖ అధికారులు పాఠశాలకు తాత్కాలికంగా తాళంవేసి అక్కడ పని చేసే టీచర్‌ను వేరే పాఠశాలకు కేటాయించారు. ఇదిలా ఉంటే ఇటీవలి ఉపాధ్యాయుల బదిలీల్లో ఈ స్కూల్ టీచర్ బదిలీ అయినా మరో ఉపాధ్యాయుడు వచ్చేంత వరకు అని రిలీవ్ ఆర్డర్ ఇవ్వలేదు. స్కూలును శాశ్వతంగా మూసేయలేదని, విద్యార్థులొస్తే కొనసాగిస్తామని ఎంఈవో వసంతకుమారి తెలిపారు.



బర్మాజీగూడ ప్రాథమిక పాఠశాల

మొగలిగిద్ద గ్రామాన్ని మండల కేంద్రం చేయాలి

శాసన మండలిలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి



షాద్‌నగర్, ఆగస్టు 2 : ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగలిగిద్ద గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి శాసనమండలి దృష్టికి తెచ్చారు. శుక్రవారం శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన మొగలిగిద్దను మండల కేంద్రం ఏర్పాటు చేయడానికి అన్ని మౌలిక వసతులు ఉన్నాయని చెప్పారు. ఆ గ్రామంలోని పాఠశాలలో విద్యనభ్యసించిన బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ స్టేట్ తొలి సీఎంగా పనిచేశారని, అలాగే సత్యనారాయణరెడ్డి మాజీ గవర్నర్‌గా, హరగోపాల్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలో 75వేల జనాభా ఉందని, ఇందులో నుంచి 35వేల జనాభాను కలుపుకుని మొగలిగిద్దను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య


మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

చేవెళ్ల, ఆగస్టు 2: రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో సీపీఐ చేవెళ్ల నియోజకవర్గం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. ఎన్నికలప్పుడు వృద్ధులకు ఇస్తామన్న కొత్త పింఛన్‌ను సైతం అందించాలని తెలిపారు. రైతులు తీసుకున్న మాఫీపోను వడ్డీ డబ్బులు కట్టాలని అధికారులు ఒత్తిడి చేయడం న్యాయం కాదని, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని న్యాయం చేయాలన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందించాలని సూచించారు. చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శిగా ఎం.సత్తిరెడ్డి, సహాయ కార్యదర్శులుగా ఎండీ మక్బూల్, వండ్ల మంజుల, మండల కార్యదర్శిగా వడ్ల మంజుల, మొయినాబాద్ మండల కార్యదర్శిగా కె.శ్రీనివాస్, శంకర్‌పల్లి మండల కార్యదర్శిగా సుధీర్, షాబాద్ మండల కార్యదర్శిగా నక్క జంగయ్యతో పాటు కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, మండలాల కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

అంకుశాపూర్‌లో పర్యటించిన డీఆర్డీవో

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2 : అంకుశాపూర్‌లో శుక్రవారం డీఆర్డీవో సాంబ శివరావు పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ దుకాణంలోని రికార్డులు, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాల, ప్రాథమిక పాఠశాల, నర్సరీని పరిశీలించారు. రేషన్ దుకాణంలోని రికార్డులు పరిశీలించి లబ్ధిదారులు ఎంతమంది? రేషన్ కార్డులు వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు ఎంతమంది ఉన్నారు? పౌష్టికాహారం అందించే విషయాన్ని అడిగి రికార్డులు తనిఖీ చేశారు. ప్రాథమిక పాఠశాలలో సదుపాయాల కల్పన, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలోని హాస్టల్ సౌకర్యాలు ఎలా ఉన్నాయని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతారెడ్డి, ఏపీఎం తౌర్యానాయక్ పాల్గొన్నారు.

స్కూల్ ఆటో బోల్తా

▸ పలువురు విద్యార్థులకు గాయాలు.. ఆసుపత్రికి తరలింపు



పూడూరు, ఆగస్టు 2 : స్కూల్ ఆటో బోల్తా పడి విద్యార్థులకు, డ్రైవర్‌కు స్వల్ప గాయాలైన సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం గడి సింగపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరారాల ప్రకారం.. శుక్రవారం పరిగి టీచర్స్ కాలనీలోని మదర్సా స్కూల్ నుంచి ఆటోలో 12 మంది విద్యార్థులు బొంరాస్‌పేట్‌కు వెళ్తున్నారు. గడి సింగాపూర్ సమీపంలోకి రాగానే కుక్క అడ్డు రావడంతో దాన్ని తప్పించేందుకు డ్రైవర్ బాబయ్య ఆటోను తిప్పడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సహా పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. విద్యార్థులను 108 అంబులెన్స్‌లో పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తల్లి అంత్యక్రియలకు రాని కూతుళ్లు

▸ భూమి ఇవ్వాల్సి వస్తుందనే..

▸ మూడు రోజులకు కొరివిపెట్టిన మనుమడు

▸ మహదేవ్‌పూర్‌లో ఘటన

కొందుర్గు, ఆగస్టు 2: ఆస్తి కోసం మానవ సంబంధాలను కొందరు మరిచిపోతున్నారు. తల్లి తనకిచ్చిన ఆస్తిని మేనల్లుడు అడుగుతున్నాడని తల్లి అంత్యక్రియలకు ముగ్గురు కూతుర్లు రాలేదు. ఈ అమానవీయ ఉదంతం కొందుర్గు మండలం మహదేవ్‌పూర్‌లో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చిన్నమ్మ, అంతిరెడ్డి దంపతులకు చిన్నారెడ్డి, జనార్ధన్‌రెడ్డి అనే ఇద్దరు కుమారులు, యాదమ్మ, లక్ష్మమ్మ, ఉమారాణి అనే ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పిల్లలు చిన్న వయసులోనే అంతిరెడ్డి మరణించాడు. తమకున్న రెండెకరాల పొలంలో సాగు చేసి చిన్నమ్మ పిల్లలను పెంచి, పెళ్లిళ్లు చేసింది. జనార్ధన్‌రెడ్డి-సంధ్యారాణి దంపతులకు ఒక కొడుకు సాకేత్‌రెడ్డి ఉన్నాడు. సాకేత్‌రెడ్డి 11నెలల వయసులోనే తల్లి సంధ్యారాణి మరణించింది. సాకేత్‌రెడ్డిని మేన మామలు ఖమ్మం జిల్లా కొత్తగూడానికి తీసుకుపోయారు. జనార్ధన్‌రెడ్డి రెండో పెండ్లి చేసుకోలేదు. తల్లితోనే గ్రామంలో ఉంటున్నాడు. ప్రతీ వేసవి సెలవుల్లో సాకేత్‌రెడ్డి మహదేవ్‌పూర్ వచ్చేవాడు. ఇదిలా ఉంటే చిన్నారెడ్డి, జనార్ధన్‌రెడ్డిలు 20సంవత్సరాల క్రితం ఏడు ఎకరాల పొలాన్ని కొన్నారు. చిన్నారెడ్డి పొలాన్ని తన భార్య పేరు మీద పట్టా చేశాడు. జనార్ధన్‌రెడ్డికి భార్య లేకపోవడంతో, తన వంతు మూడున్నర ఎకరాలు తల్లి చిన్నమ్మ పేరిట పట్టా చేశాడు. అయితే 2006లో ఎలికట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జనార్ధన్‌రెడ్డి మృతిచెందాడు. చిన్నమ్మ పేరు మీద సర్వే నంబర్ 338లో ఉన్న 3.5ఎకరాల పొలాన్ని చిన్నమ్మ రెండో కూతురు లక్ష్మమ్మ(జాఫర్‌పల్లి) పట్టా చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న సాకేత్‌రెడ్డి తన తండ్రి పొలాన్ని తనకు తిరిగి ఇవ్వాలని పలుమార్లు అడిగాడు. కానీ మేనత్త లక్ష్మమ్మ భూమి ఇవ్వలేదు. సాకేత్‌రెడ్డి పెళ్లి చేసుకొని హైదరాబాద్‌లోని తెల్లాపూర్‌లోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. చిన్నమ్మ(80) అనారోగ్యం పాలవడంతో 20రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఆమెకు షుగర్ ఎక్కువ కావడంతో ఒక కాలు తీసేయాలని వైద్యులు చెప్పడంతో, వారం రోజుల క్రితం ఉస్మానియా ఆసుపత్రిలో కుడి కాలు తొలగించారు. చిన్నమ్మను మంగళవారం ఉదయం మహదేవ్‌పూర్‌నకు తీసుకొచ్చారు. ఆమె కోలుకోలేక బుధవారం ఉదయం చనిపోయారు. తన తల్లిదండ్రులు చనిపోవడంతో తాను అనాథగా మిగిలానని, నాన్నమ్మ కూడా చనిపోయిందని, తన తండ్రి సంపాదించిన మూడున్నర ఎకరాల భూమిని తనకు ఇస్తే, నాన్నమ్మ అంత్యక్రియలు చేస్తానని సాకేత్‌రెడ్డి అన్నాడు. దీంతో తనపేరు మీద ఉన్న భూమిని అంత్యక్రియల అనంతరం పట్టా చేస్తానని సాకేత్‌రెడ్డితో లక్ష్మమ్మ చెప్పింది.



చిన్నమ్మ మృతదేహం వద్ద బంధువులు

దీనిపై ఒప్పందం రాసివ్వాలని సాకేత్‌రెడ్డి కోరాడు. దీంతో బుధవారం ముగ్గురు మేనత్తలు మహదేవ్‌పూర్ నుంచి వెళ్లిపోయారు. గురువారం వారి కోసం ఎదురుచూశారు. ఎంతకూ వారు రాకపోవడంతో, గ్రామస్థులు పెద్దకుమారుడు చిన్నారెడ్డితో మాట్లాడి సాకేత్‌రెడ్డితో శుక్రవారం చిన్నమ్మకు అంత్యక్రియలు చేయించారు. భూమి అడుగుతారని ముగ్గురు కూతుళ్లు కనిపెంచిన తల్లి అంత్యక్రియలకు రాకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు హర్షణీయం

▸ ఎమ్మార్పీఎస్ నాయకులు



కడ్తాల : మంద కృష్ణమాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున సంబురాలు నిర్వహించారు. రాజీవ్‌చౌక్ వద్ద ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు మల్లే పోగు మల్లేశ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వగ్గు మహేశ్, జంతుక యాదయ్య, జంతుక జానయ్య, పులికంటి మైసయ్య, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : మాదిగల మూడు దశాబ్దాల పోరాటం ఫలించిందని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. సుప్రీం కోర్టు తీర్పును హర్షిస్తూ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. నాయకులు మంగళపల్లి నర్సింహ, గురిగళ్ల లక్ష్మయ్య, ముత్తి కృష్ణ, కాలే వెంకటేశ్, మంకి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : మందకృష్ణ మాదిగ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ అవసరమని తీర్పు ఇచ్చిందని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు చిర్ర శీను తెలిపారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మంద కృష్ణ మాదిగ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పాలాభిషేకం చేశారు. దశరథ్, చంద్రయ్య, జాను, భాస్కర్ భీమయ్య, కిష్టయ్య, రామచంద్రయ్య, జంగయ్య, తదితరులున్నారు. కాగా, ఎస్సీ వర్గీకరణ చారిత్రాత్మకమని జనసేన సీనియర్ నాయకుడు, కేశంపేట మండల ఎల్‌హెచ్‌పీఎస్ అధ్యక్షుడు రాజునాయక్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అవసరమని చెప్పిన ప్రధాని మోదీ, జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కందుకూరు : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టులో ఇచ్చిన తీర్పును అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నట్లు గుమ్మడవెల్లి మాజీ సర్పంచ్‌లు మన్ను బాబు, గౌర ప్రభాకర్‌లు తెలిపారు. గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నాయకులు మస్కు మహేష్, మల్లేష్, వెంకటేష్, సురేష్, బాబురావు. తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చిందని మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాజీ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్.. శంషాబాద్‌కు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమానికి ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు మదిలేటి, రాచమల్ల దాస్, చిట్టిబాబు, కండక్టర్ యాదయ్య, భాస్కర్, పరందాములులతో సహా పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులను పూలమాలలు శాలువాలతో సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు బూరుకుంట సతీష్, కొనమొల్ల శ్రీనివాస్, మోహన్ రావు, రాజేందర్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




కందుకూరు : గుమ్మడవెల్లిలో అంబేడ్కర్ విగ్రహం పాదాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు



కేశంపేట : మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న ఎమార్పీఎస్ నాయకులు

రాష్ట్రంలో అత్యుత్తమ స్పోర్ట్స్ పాలసీ

▸ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



క్వీని విక్టోరియా, స్టీఫెన్ కుమార్‌లను సన్మానిస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 2: దేశంలో మరేరాష్ట్రంలో లేని విదంగా తెలంగాణ ప్రభుత్వం అత్యుత్తమ స్పోర్ట్స్ పాలసీ ని తీసుకువస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన అంతర్జాతీయ ఫిన్ స్విమ్మర్ గందం క్వీని విక్టోరియా ఇటీవల ఇంగ్లాండ్ నుంచి ఫ్రాన్స్ వరకు 36 కిలోమీటర్లు స్విమ్ ఎవరెస్ట్ గా పిలుచుకునే ఇంగ్లీష్ చానెల్ ఈది రికార్డు సృష్టించింది. తొలి తెలుగు ఓపెన్ వాటర్ మహిళా స్విమ్మర్‌గా క్వీని రికార్డు నెలకొల్పింది. అదేవిదంగా క్వీని కుమారుడు స్టీఫెన్ కుమార్ రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్ పూర్‌లో ఇటీవల జరిగిన అండర్ వాటర్ ఫిన్‌స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో మూడు పతకాలు సాధించి రాష్ట్ర ఖ్యాతిని చాటాడు. ఈ నేపథ్యంలో క్వీని విక్టోరియా, స్టీఫెన్ కుమార్ లు శుక్రవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని ఎమ్మెల్యే పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. ఇంగ్లీష్ చానెల్ ఈది అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు నెలకొల్పడం తెలంగాణ కు గర్వకారణమని అన్నారు. చిన్న వయస్సులోనే జాతీయ స్థాయిలో స్విమ్మింగ్‌లో స్టీఫెన్ కుమార్ రాణించడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్వీని కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా చేయూతనందించి ప్రోత్సాహం అందేలా చూస్తానని కసిరెడ్డి హామి ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాల తోడ్పాటునందించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ప్రతిభ ఆదారంగానే గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. కందుకూరు మండలం ముచ్చర్ల సమీపంలో త్వరలో క్రీడా యూనివర్సిటీ ఏర్పాటు చేసి ప్రతిభ కలిగిన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని నారాయణరెడ్డి తెలిపారు. క్వీని, స్టీఫెన్ కుమార్ లకు తన వంతు తోడ్పాటునందిస్తానని ఎమ్మెల్యే హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ భట్టు కిషన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, పాల శీతలీకరణ కేంద్రం చైర్మన్ బొజ్జ సాయిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సూదిని కొండల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు!

ఐదు నెలల తర్వాత నేడు కౌన్సిల్ సమావేశం

▸ హాజరుకానున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

▸ ప్రజా సమస్యలు చర్చకు వచ్చేనా!

▸ విలీన కాలనీలకు రావాల్సిన నిధులేవి?



తాండూరు, ఆగస్టు 2: ఎట్టకేలకు తాండూరు మున్సిపాలిటీ సాధారణ సమావేశం నిర్వహణకు వేళయింది. ఐదు నెలల తర్వాత ఈనెల శనివారం(నేడు) మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఎన్నికల తర్వాత జరుగుతున్న సాధారణ సమావేశం కావడంతో సమావేశానికి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో మున్సిపాలిటీలోని ప్రధాన సమస్యలు చర్చకు వస్తాయా? ఎజెండా అంశాలతోనే సరి పెడుతారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరుకానున్నారు. 30 అంశాలపై ఎజెండాను రూపొందించి కౌన్సిల్ సభ్యులకు పంపించారు. ప్రస్తుతం వర్షాకాలంతో పలు కాలనీలో వరదలు, రోడ్లు దెబ్బతిన్నడం, కాలనీలు జలమయమవ్వడం, మురుగు కాల్వలు అపరిశుభ్రంగా మారడం, అస్తవ్యవస్థమైన పరిపాలన కొనసాగుతుండడం, వీధిదీపాల సమస్య, వార్డుల్లో అభివృద్ధి పనులు వంటి వాటిపై చర్చ జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. అదేవిధంగా బురదమయమైన రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని కౌన్సిలర్లు, ప్రజలు కోరుతున్నారు.

విలీన కాలనీలకు నిధులేవి?

2019మున్సిపాలిటీ యాక్ట్ ప్రకారం మున్సిపాలిటీలో విలీనమైన కాలనీలకు ప్రత్యేక నిధులు కేటాయించింది. కానీ తాండూరు మున్సిపాలిటీ ఈనిధుల ప్రస్తావనే తీసుకురావడంలేదు. 2018లో తాండూరు మున్సిపాలిటీలోకి ఎన్టీఆర్ కాలనీ, రాజీవ్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, కొడంగల్ రోడ్డులోని మార్కండేయ కాలనీ, రసూల్‌పూర్ ఏరియా, కోకట్‌రోడ్డు, చించోలి రోడ్లలోని బసవేశ్వర కాలనీలు విలీనమయ్యాయి. కౌన్సిల్ ఏర్పడినప్పటి నుంచి ఈ కాలనీ లకు బడ్జెట్ నుంచి ప్రత్యేక నిధుల కేటాయింపు జరగలేదు.

'ఆంధ్రజ్యోతి'లో నెలక్రితమే కథనం

జూలై 7న 'కౌన్సిల్ మిటింగ్ ఎప్పుడో?' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికలు ముగిసి నాలుగు నెలలు గడిచినా సాధారణ సమావేశాన్ని ఏర్పాటు చేయకపోడంపై ప్రచురితమైన ఈ కథనంతో స్థానికంగా చర్చ మొదలైంది. ఎట్టకేలకు నేడు సమావేశం జరగనుంది.



క్యాబ్ డ్రైవర్లతో చర్చలు జరుపుతున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు

క్యాబ్ డ్రైవర్లతో పోలీసుల చర్చలు సఫలం

▸ ఇతర రాష్ట్రాలకు చెందిన మూడు క్యాబ్‌లు సీజ్

శంషాబాద్ రూరల్, ఆగస్టు 2 : తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మూడు రోజులుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో క్యాబ్ డ్రైవర్లు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు స్పందించిన స్థానిక పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, జీఎంఆర్ రక్షా సిబ్బంది గురువారం ఏసీపీ కె.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ట్రాఫిక్, ఎంవీఐ పోలీసులు, క్యాబ్ డ్రైవర్లు, ఓలా, ఉబెర్ మేనేజర్లతో చర్చలు జరిపారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే క్యాబ్‌లు ఎయిర్‌పోర్టులో రాకపోకలు సాగిస్తున్నాయి. దాంతో స్థానిక క్యాబ్ డ్రైవర్లు.. తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శుక్రవారం క్యాబ్ డ్రైవర్లతో ఏసీపీ మాట్లాడుతూ ఆర్టీఏ యాక్ట్ ప్రకారం.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే క్యాబ్‌లు కేవలం ప్రయాణికులను డ్రాప్ తప్ప పికప్ చేసుకోకూడదని, అలా తీసుకెళ్లే క్యాబ్‌ను సీజ్ చేస్తామని స్థానిక క్యాబ్ డ్రైవర్లకు హామీ ఇచ్చారు. సమ్మతించిన క్యాబ్ డ్రైవర్లు ఆందోళన విరమించి తిరిగి యథావిధిగా క్యాబ్‌లను నడిపించారు. ఎంవీఐ ఇన్‌స్పెక్టర్ మూడు ఇతర రాష్ట్రాలకు చెందిన క్యాబ్‌లను సీజ్ చేసినట్లు చెప్పారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. చర్చల్లో ట్రాఫిక్ సీఐ రాజు, ఆర్టీఏ సీఐ బాల్‌రాజు, ఎంవీఐ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి, జీఎంఆర్ అధికారులు, క్యాబ్ యూనియన్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మత్స్యశాఖకు రెగ్యులర్ అధికారిని నియమించాలి

▸ రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్‌కు జిల్లా చీఫ్ ప్రమోటర్ వినతి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 2 : జిల్లా మత్స్యశాఖకు రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరుతూ రాష్ట్ర మత్స్య శాఖ కమిషనర్ ప్రియాంక అలా (ఐఏఎ‌స్)కు జిల్లా చీఫ్ ప్రమోటర్ గోరెంకల నర్సింహ శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా మత్స్య శాఖ అధికారులపై అవినీతి ఆరోపణలు రావడంతో ఇద్దరు అధికారులపై సస్పెన్షన్‌కు గురైనట్లు, దీంతో రెగ్యులర్ డిఎఫ్‌వో, సూపరిండెంట్‌ను నియమించపోవడం వల్ల నూతన సోసైటిల ఏర్పాటు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. అధికారులు లేక ఎన్నో సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని తెలిపారు. రంగారెడ్డి జిల్లా పేరుతో గతంలో ఉన్న ఎడి హోదాను రంగారెడ్డి జిల్లాకు కల్పించాలని కోరాకు. జిల్లా మత్స్య శాఖకు రెగ్యులర్ అధికారులను నియమించాలని ఆయన కోరారు.

అక్రమ అనుమతులపై సమగ్ర విచారణ జరుపుతాం

కీసర, ఆగస్టు 2 : మండల కేంద్రం కీసరలో అక్రమంగా జారీచేసిన ఇళ్ల అనుమతులపై సమగ్ర విచారణ జరుపుతామని డీఎల్పీవో సాంబిరెడ్డి తెలిపారు. ఇటీవల అక్రమ అనుమతులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు శుక్రవారం కీసర గ్రామపంచాయతీలో సాంబిరెడ్డి విచారణ చేపట్టారు. పంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. అక్రమ అనుమతులు పొంది ఇళ్లు నిర్మించుకున్న విషయమై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతామని తెలిపారు. అలాగే గ్రామంలో జరిగిన అక్రమ నిర్మాణాలపై ఆరా తీశారు. అలాంటి నిర్మాణాలను ప్రోత్సహించిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

పనుల్లోని బాలలను తల్లిదండ్రుల వద్దకు చేర్చాం

▸ ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఆగస్టు 2: బడీడు పిల్లలను పనుల్లో పెట్టుకున్న వారిపై 15ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ పదో విడతలో పనుల్లో ఉన్న 173 మంది బాలలను గుర్తించి వారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చామన్నారు. వీరిలో 151 మంది మగ పిల్లలు, 22 మంది బాలికలు ఉన్నారన్నారు. బాలబాలికల్లో 31మంది ఇతర రాష్ట్రాల వారు ఉన్నారన్నారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేశామన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు మనందరం బాధ్యతగా కృషిచేయాలని కోరారు. ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సబ్ డివిజన్ల వారీగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేసి ఆపరేషన్ ముస్కాన్ 10ను విజయవంతం చేసిన ప్రత్యేక బృందాల సభ్యులను ఎస్పీ అభినందించారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పెద్దేముల్, ఆగస్టు 2: పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఎల్పీవో శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని మన్‌సాన్‌పల్లి, మారెపల్లితండా, మదనంతాపూర్, కొండాపూర్, రేగొండి, రుక్మాపూర్, మంబాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే పాటిస్తున్నారా? లేదా? అనే విషయాలపై ఆరా తీశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కార్యదర్శులు కొందరు ఉదయం 11 గంటలైనా గ్రామాలకు రావడం లేదనే విషయం తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శులకు సమయపాలన చాలాముఖ్యమని, గ్రామాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను పరిశీలించాలన్నారు. ప్రత్యేకాధికారులు కూడా తప్పనిసరిగా పర్యటించాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్నందున మురుగునీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు సైతం విద్యార్థులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని కోరారు. ఇళ్లలో తొట్లు, కుండలు వంటి వాటిలో నీటినిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీఈవో రతన్‌సింగ్ ఉన్నారు.

తుదిదశకు చేరుకున్న దోర్నాల వంతెన పనులు

ధారూరు, ఆగస్టు 2: దోర్నాల అసంపూర్తి వంతెన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఏడేళ్లుగా అసంపూర్తిగా ఉన్న వంతెన రాష్ట్ర శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ చొరవతో పనులను పూర్తి చేయిస్తున్నారు. వంతెనపై శుక్రవారం స్లాబ్ నిర్మించే పనులను ఆర్అండ్‌బీ ఏఈ శ్రావణ్‌కుమార్ పరిశీలించారు. త్వరలో ఈ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు రాకపోకలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

గ్రామాల్లో వైభవంగా బోనాలు



తాండూరు రూరల్: ఆలయానికి బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

తాండూరు రూరల్, ఆగస్టు 2 : ఆషాడమాసం ముగింపు సందర్భంగా తాండూరు మండలం బెల్కటూర్ గ్రామంలో పోచమ్మ దేవతకు బోనాల పండుగను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం వేళల్లో మహిళలంతా బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చారు. డప్పువాయిద్యాల మధ్య బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది.

కొడంగల్: మండలంలోని ఎరన్‌పల్లిలో శుక్రవారం పోచమ్మ దేవతకు బోనాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు పసుపు, గంధం, పూలతో అలంకరించగా గ్రామంలోని పురవీధుల మీదుగా ఊరేగించి ఆలయంలో ప్రత్యేక నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు.

కొడంగల్ రూరల్: మండలంలోని అప్పాయిపల్లిలో శుక్రవారం పోచమ్మ దేవతకు ఘనంగా బోనాలు సమర్పించారు. గ్రామంలో ఇంటింటా మహిళలు బోనాలతో బయల్దేరి ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా బయల్దేరారు. డప్పుచప్పుళ్లతో, పోతరాజు విన్యాసాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

పెద్దేముల్: ఖానాపూర్‌లో శుక్రవారం రక్షమైసమ్మ అమ్మవారికి బోనాల పండగ నిర్వహించారు. ఖానాపూర్ గ్రామంలో ఆషాడమాసాన్ని పురస్కరించుకుని బోనాల పండగ వైభవంగా నిర్వహించారు. మహిళలు పిండివంటలు చేసి బోనంతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.



పెద్దేముల్: ఖానాపూర్‌లో బోనాలతో బయల్దేరిన మహిళలు



కొడంగల్ రూరల్: అప్పాయిపల్లిలో బోనాలతో ఆలయానికి చేరుకున్న మహిళలు

పరిగి: గ్రామ దేవతలను ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మారుతికిరణ్ అన్నారు. మండలంలోని రాపోల్‌లో శుక్రవారం నిర్వహించిన పోచమ్మ, మైసమ్మ బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరం మారుతికిరణ్‌ను స్థానికులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశవులు, హరికృష్ణ,వెంకటయ్య, ప్రవీణ్,అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కులకచర్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించడంతో పాటు తెప్పోత్సవం, బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం వేళలో మహిళలు కుంకుమ, పసుపు, గంధం, వేపాకు, పూలు తదితర వాటితో అందంగా బోనాలను అలంకరించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.



కులకచర్ల: బోనాల ఉత్సవాల్లో గ్రామస్థులు

పోచమ్మ ఆలయాల్లో ప్రత్యేకపూజలు

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గల నల్ల, ఎర్ర పోచమ్మ ఆలయాల్లో వార్షికోత్సవ పూజలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం నల్ల, ఎర్రపోచమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గత రెండు సంవత్సరాల క్రితం అన్నోజిగూడలో నల్ల, ఎర్రపోచమ్మలతో పాటు మహంకాళి, ఈదమ్మ అమ్మవార్ల ఆలయాలను నిర్మించారు. రెండో వార్షికోత్సవం సందర్భంగా హోమాలు నిర్వహించారు. ఆదివారం నాడు అమ్మవార్లకు బోనాలు సమర్పించేందుకు ప్రత్యేక ఏర్పాటు



చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్డియా నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ కెఎంరెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో మోదీ ప్రభుత్వం ముందడుగు



వికారాబాద్: ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న వడ్లనందు

వికారాబాద్, ఆగస్టు 2: రాజ్యాంగ స్ఫూర్తితో ప్రధాని మోదీ ప్రభుత్వం ముందడుగు వేస్తోందని బీజేపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్లనందు అన్నారు. వికారాబాద్‌లో శుక్రవారం ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతి హక్కుల కోసం మందకృష్ణ మాదిగ జీవితాన్ని త్యాగం చేశారని అన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను తీసేస్తారని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలనే సంకల్పంతో ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు శ్రీకాంత్‌రెడ్డి, బందయ్య, యువ నాయకులు రాజు, రమేష్, శ్రీనివాస్, మొలప్ప, జనార్థన్, గోవర్ధన్, అరవింద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: ఎస్సీ వర్గీకరణ కోసం సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్, బీజేపీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, బీజేపీ నాయకులు శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు బాబయ్యానాయుడు, జనార్దన్, నాగేందర్, జగదీశ్వర్, మల్లేశం, ఆలమయ్య, శ్రావణ్‌గౌడ్, నర్సింహులు, జగదీశ్, యాదగిరి, శ్రీనివాస్, వీరేశం, ముకుందం, వెంకటేశ్ పాల్గొన్నారు.

బషీరాబాద్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చరిత్రత్మక తీర్పుతో మూడు దశాబ్దాల కల నేరవేరిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గజ్జల ప్రవీణ్‌మాదిగ అన్నారు. బషీరాబాద్‌లోని అంబేడ్కర్ చౌక్ వద్ద శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యస్థాపకులు మందకృష్ణమాదిగ చిత్రపటాపనికి ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.కృష్ణమాదిగ, సీనియర్ నాయకులు బి.శంకరప్ప, కిష్టప్ప, రాములు, శ్రీశైలం, బసంత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్: ఎస్సీల వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనదని ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని మంబాపూర్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ప్రధానిమోదీ, మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లిఖార్జున్, జిల్లా ప్రధానకార్యదర్శి స్వామిదాస్, మాజీ సర్పంచ్ ప్రకాశం, సుందర్, బోనప్ప, సాయికుమార్, అనంతయ్య, లాజర్ పాల్గొన్నారు.

కొడంగల్: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కొడంగల్ పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో టపాసులు పేల్చి ఒకరికొకరు స్వీట్లు పంచుకున్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిక చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమశేఖర్, మల్కప్ప, ఆర్.అంజి, దస్తప్ప, అశోక్, సిద్దు, నాగేష్, అశోక్, రఘు, అర్జున్, సాయి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కీసర: ఎస్సీ వర్గీకరణలో దాదాపు 30 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం చేసి సాధించిన ఘనత మందకృష్ణ మాదిగకే దక్కుతుందని కీసర అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్ తెలిపారు. కీసర మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



కీసర: మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

ధారూరు అటవీ రేంజర్‌గా రాజేందర్

ధారూరు, ఆగస్టు 2: ధారూరు అటవీ రేంజ్‌కు పూర్తిస్థాయి రేంజర్‌గా బి.రాజేందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నాగర్‌కర్నూల్ అటవీ రేంజ్ స్ట్రైయికింగ్ ఫోర్స్ రేంజర్‌గా పనిచేస్తున్న ఆయన కౌన్సిలింగ్‌లో ఇక్కడికి బదిలీఅయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి రేంజర్‌గా కొనసాగుతున్న శ్యాంకుమార్ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు.

పశుసంవర్ధక శాఖ తాండూరు ఏడీగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్

తాండూరు రూరల్, ఆగస్టు 2: పశు సంవర్ధశాఖ తాండూరు ఏడీగా డాక్టర్ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తాండూరులో ఏడీగా పనిచేసిన డాక్టర్ ప్రభురాజ్ ఇటీవల మేడ్చల్ జిల్లా పశు సంవర్ధశాఖ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ వచ్చారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా కాంతారావు

తాండూరు రూరల్, ఆగస్టు 2: తాండూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా శుక్రవారం కాంతారావు బాధ్యతలు చేపట్టారు. తాండూరు కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, ఏసీడీపీవో శ్రీలక్ష్మీ నుంచి ఛార్జ్ తీసుకున్నారు. ఇటీవల ఇక్కడ పనిచేసిన రేణుక రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ క్లస్టర్ సీడీపీవోగా బదిలీ అయ్యారు. ఏసీడీపీవో శ్రీలక్ష్మీ తాత్కాలిక బాధ్యతలు చేపట్టారు. ఆమె వద్ద నుంచి కాంతారావు బాధ్యతలు చేపట్టారు.

హైదరాబాద్‌కు తరలిన ఉపాధ్యాయులు

కొడంగల్, ఆగస్టు 2: ఉద్యోగోన్నతి పొందిన జీహెచ్ఎం, ఐఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, భాషోపాధ్యాయులతో శుక్రవారం హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డితో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు కొడంగల్ నుంచి బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కరుణాకర్, చంద్రకాంత్, వెంకట్రాములు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: కొడంగల్‌లో ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞత సభలో పాల్గొనేందుకు తరలివెళ్లారు. మండల విద్యాధికారి రాంరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కృతజ్ఞత సభకు తరలిన వారిలో వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కరుణాకర్, చంద్రకాంత్, వెంకట్ రాములు, విష్ణుకుమార్‌లతో పాటుగా కొడంగల్, బొమ్మరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల ఉపాధ్యాయులు ఉన్నారు.

5న జినుగుర్తి 33/11కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభం

తాండూరు రూరల్, ఆగస్టు 2: మండలంలోని జినుగుర్తి గ్రామ శివారులో రూ.2కోట్ల 40లక్షలతో చేపట్టిన 33/11కేవీ సబ్‌స్టేషన్ ఈనెల 5న రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఈ సబ్‌స్టేషన్‌ను వికారాబాద్ జిల్లా విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకట్‌నాయుడు ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో శుక్రవారం సందర్శించారు. తాండూరు డీఈ భానుప్రసాద్‌ను పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో బటన్‌ప్రెస్ చేసిన వెంటనే విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యగా ట్రయల్‌రన్ చేసి పరిశీలించాలని తెలిపారు. ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేసేలా చర్యలు చేపట్టాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తాండూరు ఏడీ ఆదినారాయణను ఆదేశించారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో జినుగుర్తి, జినుగుర్తితండా, ఉద్దండాపూర్, మైసమ్మగడ్డతండా, గుండ్లమడుగుతండా, సంకిరెడ్డిపల్లితండా, సిరిగిరిపేట్, అల్లాపూర్ తదితర గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారమవుతుందని ఎస్సీ సంజీవరెడ్డి తెలిపారు. ఆయన వెంట తాండూరు మండల ట్రాన్స్‌కో వెంకట్‌నాయుడు, రాంచందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై చర్చిస్తున్న జిల్లా ఎస్ఈ, సూపరింటెండెంట్

పంచాయతీ కార్యదర్శులకు సన్మానం

మోమిన్‌పేట్, ఆగస్టు 2: టేకులపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య బదిలీపై వెళ్లడంతో ప్రజాప్రతినిధులు శుక్రవారం పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బి.విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాషా, రైస్, మాజీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: దుద్యాల మండలంలోని ఈర్లపల్లి, సత్తర్‌కుంట తండా గ్రామ పంచాయతీల్లో ప్రభాకర్, నరేందర్ పంచాయతీ కార్యదర్శులుగా గత ఐదు సంవత్సరాలుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లడంతో గ్రామస్థులు సన్మానించారు. పంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్థులు వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నేనావత్ రవినాయక్, పిట్ల మొగులయ్య, ఆర్.పెంటప్ప, వెంకటయ్య ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

తాండూరు, ఆగస్టు 2: ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న సూచించారు. డ్రై - డే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 25వ వార్డులో నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, కమిషనర్ విక్రం సింహారెడ్డి, ప్రవీణ్ గౌడ్ పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: మున్సిపల్ పరిధిలో ఈనెల 5 నుంచి 9వరకు నిర్వమిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రిదీపిక నర్సింహారెడ్డి కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ నిర్వహణపై కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రమేష్, కమిషనర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.



నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న

బషీరాబాద్: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని బషీరాబాద్ తహసీల్దార్, గ్రామ ప్రత్యేకాధికారి వై.వెంకటేష్ అన్నారు. మండలంలోని అల్లాపూర్(బి) గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో కలియతిరిగి వన నర్సరీ, మురుగునీటి వ్యవస్థను పరిశీలించారు. ఈ నెల 5 నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమానికి సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

శామీర్‌పేట: గ్రామాల్లో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు కొత్తగా కమిటీలను ఏర్పాటు చేసి స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టాలని మండల స్పెషలాఫీసర్, జిల్లా డిప్యూటీ కలెక్టర్ సైదులు ఆదేశించారు. శుక్రవారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో మండల స్పెషలాఫీసర్ సైదులు మండల, గ్రామాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

సంక్షిప్తంగా..

● **మేడ్చల్ టౌన్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన స్వామిని బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ఊసిగారి శ్రీనివాస్, కౌన్సిలర్ అమరం సరస్వతి శుక్రవారం సన్మానించారు.

● **పరిగి:** పరిగి మున్సిఫ్ కోర్టులో ఏజీపీగా పనిచేసిన వెంకట్‌రెడ్డిని శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఇటీవల నూతన ఏజీపీగా సీహెచ్ బాలముకుందం నియమితులైన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, భక్తకుమార్, జి.కృష్ణారెడ్డి, లింగం, నరేంద్రయాదవ్ పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన ముదిరాజ్ కులస్థులను బీసీ డీ గ్రూప్ నుంచి ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కందుల కుమార్ శుక్రవారం తహసీల్దారు రజినికి వినతిపత్రం అందజేశారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** అవుషాపూర్ గ్రామాన్ని ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో కలపాలని శుక్రవారం గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అవుషాపూర్ గ్రామాన్ని యాదాద్రీ-భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలంలో కలుపుతారని వస్తున్న వార్తల నేపథ్యంలో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏనుగు మశ్చేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** మండలంలోని పూడూరు, రాయిలాపూర్ గ్రామాలను మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని కోరుతూ రెండు గ్రామాల ప్రజలు ప్రిన్సిపాల్ సెక్రటరీకి శుక్రవారం విన్నవించారు.

● **కీసర:** తమ గ్రామాన్ని జీహెచ్ఎంసీలోనైనా లేక కొత్తగా ఏర్పాటయ్యే కీసర మున్సిపాలిటీలోనైనా కలపాలని భోగారం గ్రామస్తులు శుక్రవారం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు.

● **మేడ్చల్ టౌన్/దోమ:** బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరారం జగన్‌గౌడ్ మేడ్చల్‌లో శుక్రవారం బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అదేవిధంగా దోమ మండలంలోని దాదాపూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు అనంతయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాద్‌రావు, మారుతి కిరణ్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప సూచించారు.

● **తాండూరు:** విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికులు ఎం.శ్రీనివాస్, మ్యాతరి మునియప్ప, దస్తమ్మ, కె.దస్తప్ప, పుష్పలత, అశోక్ కుమార్ స్థానంలో వారి కుటుంబసభ్యులకు అవకాశం కల్పించాలని కార్మిక సంఘం నాయకులు, జవాన్లు మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం విన్నవించారు.

● **ఘట్‌కేసర్:** పోచారం పరిధిలోని అన్నోజిగూడ దివ్యాంగుల కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామదేవతల ఆలయాలకు దాత కౌన్సిలర్ బద్దం మమతాజగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం స్లాబువేయించారు.

● **పూడూరు:** సోమన్‌గుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి శ్రేయాన్ష్‌కు శుక్రవారం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

● **కొడంగల్:** పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా జాతీయ రహదారి కావడంతో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఏవైనా కార్యక్రమాలు నిర్వహించే ముందు పోలీసుల అనుమతి తీసుకోవాలని హెడ్ కానిస్టేబుల్ శివరాములుగౌడ్ తెలిపారు.

● **మూడుచింతలపల్లి:** కొత్తూరు చెందిన అంజనేయులుకు రూ.41,500లు, సవితకు రూ.55వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ శుక్రవారం బోడుప్పల్‌లోని ఆయన నివాసంలో అందజేశారు.

● **దౌల్తాబాద్:** కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం దౌల్తాబాద్ మండలంలోని దేవరఫస్లాబాద్ గ్రామ పంచాయతీలో వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు.

● **పెద్దేముల్:** మండలంలోని రేగొండిలో మాజీ సర్పంచ్ షైదర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వికారాబాద్ శ్రీసాయి డెంటల్ కాలేజీ వైద్యులు గ్రామస్థులకు దంతపరీక్షలు చేశారు. క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ షరీఫ్ గ్రామస్థులకు పలు సూచనలు చేశారు.

● **మేడ్చల్ టౌన్:** కిష్టాపూర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

● **మేడ్చల్ టౌన్:** 23వ వార్డు అంగన్ వాడీ కేంద్రంలో శుక్రవారం జేఈ వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని కౌన్సిలర్ కౌడే మహేష్ ప్రారంభించారు.

క్రైం కార్నర్

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2: తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి చోరీ జరిగిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైం సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, బాలాజీనగర్‌కు చెందిన మహ్మద్ అక్రం గత నెల 31న ఇంటికి తాళం వేసి నగరంలోని మలక్‌పేట్‌కు బంధువుల ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో స్థానికులు గమనించి అక్రంకు సమాచారం అందించారు. ఇంటికి వచ్చి చూసేసరికి తలుపు తెరిచే ఉండటంతో బెడ్‌రూంలోని బీరువాలోని 30 తులాల వెండి అభరణాలు పట్టగొలుసులు, కాళ్ల కడియాలతో పాటు కొంత నగదు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు క్రైం సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సాహు(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సైదులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిస్సా రాష్ట్రం కటక్ పట్టణానికి చెందిన దివాకర్ సాహు(43) ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో ఉంటూ స్థానిక ఆదర్శ్ బార్‌లో చీఫ్‌చెఫ్‌గా పని చేస్తుంటాడు. గత నెల 29న బార్‌లో పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుతుండగా పోలీసుస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దివాకర్ సాహు తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. సమాచారం అందుకున్న పోలీసులు అతన్ని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో దివాకర్ సాహు చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడు అదృశ్యం



గణేశ్

కులకచర్ల, ఆగస్టు 2: మండల కేంద్రంలో ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. కులకచర్లకు చెందిన శివ్వని గణేశ్(18) తాండూర్ సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో సెకండియర్ చదువుతున్నాడు. గతనెల 31న కులకచర్ల ఇంటి నుంచి కళాశాలకు వెళ్లాడు. కానీ రెండురోజులుగా కళాశాలకు వెళ్లలేదనే సమాచారంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో శుక్రవారం కులకచర్ల పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

మేడ్చల్ టౌన్, ఆగస్టు 2: రోడ్డు ప్రమాదంలో ఓ బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న సాయికుమార్(22)తో కలిసి మరో ఇద్దరు విద్యార్థులు బైక్‌పై రింగ్‌రోడ్డుకు ఆనుకుని ఉన్నసర్వీస్ రోడ్డుపై నుంచి వెళ్తున్నారు. ఈ క్రమంలో యూటర్న్ వద్ద కంటైనర్ లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సాయికుమార్ అక్కడికక్కడే మృతిచెందగా బైక్‌పై ఉన్న మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సాయికుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

6వ వార్డులో సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్, ఆగస్టు 2: వికారాబాద్ పట్టణంలోని 6వ వార్డు అధ్వాన్నంగా మారిందని వెంటనే సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ డిమాండ్ చేశారు. వార్డులో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడుతూ.. మహావీర్ హాస్పిటల్ రోడ్డు వెంకటాపూర్ తండా, మదిలగడ్డ తండా రోడ్లలో పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయని, వాటిని వెంటనే సీసీ రోడ్లు వేయాలని, బాత్రూంలు, డ్రైనేజీ వీధి లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. లేదంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మల్కయ్య, శ్రీను, రాజు, బాబునాయక్, రాజునాయక్, కేతవత్ రాజు, రాజునాయక్, రాజేష్, నరేష్, చంద్రనాయక్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత

బషీరాబాద్, ఆగస్టు 2: మండలంలోని బద్లాపూర్, గంగ్వార్, కొర్విచెడ్, జీవన్గి బర్కాల పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తాండూరు మార్వాడీ యువమంచ్ చేయూతనందించింది. శ్రీ బంకట్‌లాల్ నందకిషోర్ పర్తాని ఆర్థిక సాయంతో 427 మంది మంచ్ ప్రతినిధులు విద్యార్థులకు శుక్రవారం నోట్‌బుక్స్, పెన్నులు, ష్యాలు, ప్లేట్లు వంటివి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంచ్ అధ్యక్షుడు అనిల్ సరడా, కార్యదర్శి సచిన్ రవికిషోర్, అరున్ సారడా, దినేష్ పర్తాని, పవన్‌సోని, సంజయ్‌సారడా, ఆశిష్ సారడా, పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు

కీసర రూరల్, ఆగస్టు 2: మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు కేటాయిస్తున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధి ఎనిమిదో వార్డులో శుక్రవారం రూ.6.50లక్షలతో చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కౌకుంట్ల మమత, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల అరెస్ట్

దోమ, ఆగస్టు 2: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా మాజీ సర్పంచును అరెస్టు చేశారు. మండల కేంద్రంలో పోలీసులు మాజీ సర్పంచ్‌లను వెళ్లకుండా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి, మాజీ సర్పంచులు ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

తాండూరు, ఆగస్టు 2: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని కౌన్సిలర్ సంగీత ఠాకూర్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం తాండూరులోని గాంధీనగర్ అంగన్ వాడీ సెంటర్‌లో మాట్లాడుతూ.. పిల్లలకు పుట్టగానే ముర్రుపాలు తప్పనిసరిగా పట్టించాలన్నారు. దీంతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, ఏఎన్ఎం శాంత, అంగన్‌వాడీ టీచర్ రాధా, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

బషీరాబాద్: మండలంలోని కంసాన్‌పల్లి(ఎం) గ్రామంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ శశికళ తల్లిపాల ప్రాముఖ్యతపై వివరించారు. ఈ గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశావర్కర్, ఆయా, పలువురు మహిళలు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దారుగా రాజేందర్

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2: ఘట్‌కేసర్ డిప్యూటీ తహసీల్దార్‌గా కె.రాజేందర్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మల్కాజ్‌గిరి తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా పనిచేసి ఘట్‌కేసర్ తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసిన సందీప్‌రెడ్డి కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి డిప్యూటీ తహసీల్దారుగా బదిలీపై వెళ్లారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, ఆగస్టు 2: ఐటీఐ కోర్సుల్లో మూడవ విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి కళాశాలలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 12 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9177954208, 8555865421 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి వైద్యురాలిగా అనురాధ

ఘట్‌కేసర్, ఆగస్టు 2: ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన కోట్యానాయక్ నాగార్జునసాగర్‌కు బదిలీఅయ్యారు. నాగర్‌కర్నూల్ ఆసుపత్రి వైద్యురాలు అనురాధ ఘట్‌కేసర్‌కు బదిలీపై రానున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ స్థానిక నాయకులతో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి పూల కుండీలను బహూకరించారు. తాను ఇంకా బాధ్యతలు చేపట్టలేదని, దానికి ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రావాల్సిఉందని డాక్టర్ అనురాధ తెలిపారు.



అనురాధకు పూలకుండిని బహూకరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని